విద్యార్థులకు వైద్య పరీక్షలు

శంషాబాద్: పట్టణంలోని సాతంరాయిలోని బీసీ గురుకుల డిగ్రీ కళాశాల (బాయ్స్)లో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అనూప్ చందు విద్యార్థులను పరీక్షించి మందులు అందజేశారు. ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలు, సూచనలు విద్యార్థులకు వివరించారు. ఆరోగ్యంపై విద్యార్థులు శ్రద్ధ చూపాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షహనా సజ్జీన్ సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సరుకుల అందజేత



పిల్లలతో మాట్లాడుతున్న కమాండెంట్ రామకృష్ణ

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో 'ఈ' కంపెనీ వార్షిక కార్యక్రమంలో భాగంగా బెటాలియన్ కమాండెంట్ రామకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్ రాంబాబు చీర్స్ ఫౌండేషన్ అనాథాశ్రమాన్ని శనివారం సందర్శించారు. సరుకులు, పండ్లు, బియ్యం, నూనె అందజేశారు. కార్యక్రమంలో కమాండర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్, ఈ కంపెనీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయండి



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లో ఈ నెల 19వ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్ రావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కన్యగారి నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహాసభల్లో ప్రజా సమస్యలు, రాజకీయ సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక విధానాలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్‌లో చేపట్టనున్న కార్యాచరణలను రూపొందించనున్నట్లు వెల్లడించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఎ.రియాజ్, కౌన్సిల్ సభ్యుడు జె.ఆనంద్‌గౌడ్, మండల సహాయ కార్యదర్శులు జె.విజయానంద్ గౌడ్, ఎం.డి.షఫీ, ఎర్రబోడు, కార్యదర్శి పాండు, లక్ష్మీగూడ కార్యదర్శి జె.సదానంద గౌడ్, ఆసీఫ్ కార్యదర్శి సత్యం పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: హాస్టల్ ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. వివరాలివీ... వరంగల్‌కు చెందిన బి.అఖిల్ అమీర్‌పేట బీఎస్ఎన్ఎల్ ఆఫీసు సమీపంలో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. తాత్కాలికంగా తమ బంధువుల ద్విచక్ర వాహనాన్ని వినియోగిస్తున్నాడు. ఈ నెల 7వ తేదీ రాత్రి వాహనాన్ని తాను ఉంటున్న హాస్టల్ ఎదుట పార్కింగ్ చేసి ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల వెదికినా ప్రయోజనం లేకపోవడంతో శనివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూసీ పరీవాహక వాసులు అప్రమత్తంగా ఉండాలి

చాదర్‌ఘాట్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో హిమాయత్‌సాగర్ గేట్లు మరిన్ని తెరిచే అవకాశం ఉన్నందున మూసీ పరీవాహక ప్రాంతాలవాసులు అప్రమత్తంగా ఉండాలని మలక్‌పేట సర్కిల్–6 డీసీ అలీ పేర్కొన్నారు. శనివారం ఆయన ఓల్డ్‌మలక్‌పేట మూసీ పరిసర ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. వరదల సమస్య ఉంటే వెంటనే హైడ్రా, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారలకు ఫిర్యాదు చేయాలన్నారు.

ఘనంగా రక్షాబంధన్



రక్షాబంధన్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అక్కాచెల్లెలు, అన్నదమ్ములకు రాఖీలు కట్టారు. స్వీట్లు తినిపించి ఆశీర్వాదం అందించారు.
– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ బృందం



ఆస్మాన్‌ఘడ్ గాంధీనగర్‌లో ..



రాష్ట్ర వైఎస్సార్ యువజన నాయకుడు డాక్టర్ మెట్టు శ్రీకాంత్‌కు రాఖీ కడుతున్న సోదరి





సిద్దిపేట జిల్లా వైసీపీ అధ్యక్షుడు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు తడక జగదీశ్వర్ గుప్తాకు..



టీపీసీసీ అధ్యక్షుడికి రాఖీ కడుతున్న మమతా గుప్తా



రెయిన్‌బో హోమ్‌లో రాఖీ వేడుకలు



భజరంగ్‌సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్.లక్ష్మణ్‌రావుకు..

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ గౌలిగూడ, ఉస్మాన్‌గంజ్, ఉస్మానియా ఆసుపత్రి విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఈనెల 10న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అశోక్‌బజార్, నేషనల్ హోటల్, తారా హోటల్ లేన్, అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్, ఉస్మానియా ఆసుపత్రి లేన్, గోల్ మజీద్ లేన్ ఉస్మానియా ఆసుపత్రి అవుట్‌పేషంట్ బ్లాక్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని వారు కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

చార్మినార్: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ పదవితో పాటు ఇతర బోర్డు పదవుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి సయ్యద్ షా ఖదీరుల్లా ఖాద్రీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గతనెల 30న సొసైటీ చైర్మన్ డాక్టర్ సమద్ ఉస్మానీ మృతి చెందడంతో ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పరిశీలన అనంతరం 31న ఎన్నికల నిర్వహణ సెప్టెంబర్ 5న ఫలితాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8500212306 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కనుల పండువగా మహా ముని ర్యాలీ



ర్యాలీలో పులిపాటి రాజేశ్ కుమార్ తదితరులు

చార్మినార్: మార్కేండయ బాల భక్త సమాజం ఆధ్వర్యంలో పాతబస్తీ దూద్‌బౌలిలోని సిప్లిగంజ్‌లో 93వ మార్కేండయ మహా ముని శివ లింగ సామూహిక ఊరేగింపును శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బహదూర్‌పురా నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్ కుమార్ మాట్లాడుతూ.. ఈ పర్వదినం రోజే దారం పుట్టిందని నమ్మిన పద్మశాలీలు ఏటా తమ సోదరులకు దారంతో రాఖీలు కట్టి రక్షణగా ఉండాలని కోరుతారన్నారు. అందుకే ఈ రోజు దారానికి పూజలు నిర్వహిస్తారన్నారు. గద్దె శంకర్, పులిపాటి ప్రభాకర్, దుర్గేశ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో తిరుపతి శ్రీనివాస్ రావు, భాను చందర్ యాదవ్, భారత, మధు, శేఖర్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీకి ఏర్పాట్లు చేయాలని వినతి



సీపీకి వినతి పత్రం ఇస్తున్న మీర్ హైదర్ అలీ జాఫ్రీ

చార్మినార్: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా ఈనెల 15న నిర్వహించనున్న అర్బెన్ ర్యాలీకి ఏర్పాట్లు చేయాలని మర్కజీ అంజుమన్ మాతమి గ్రూహాన్ అక్బారీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మీర్ హైదర్ అలీ జాఫ్రీ కోరారు. ఈమేరకు జైనుల్ అబేదీన్‌తో కలిసి సీపీ సి.వి ఆనంద్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దారుషిఫాలోని బైతుల్ షరీఫ్ ఆషుర్‌ఖానా నుంచి డబీర్‌పురాలోని బీబీకాఅలావా వరకు ర్యాలీ ఉంటుందని బందోబస్తుతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సీపీని కోరినట్లు ఆయన తెలిపారు.

పొంచి ఉన్న వ్యాధులు..!



శివగంగానగర్‌లో పొంగుతున్న డ్రైనేజీ



హనుమాన్‌నగర్‌లో..



గోల్కొండ బడాబజార్‌లో పొంగుతున్న డ్రైనేజీ

చార్మినార్: పాతబస్తీలో వ్యాధుల ప్రమాదం పొంచి ఉన్నది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు తోడు పలుచోట్ల డ్రైనేజీలు పొంగి పొర్లుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఈ సీజన్‌లో ప్రధానంగా కలరా, డెంగీ, టైఫాయిడ్, విరేచనాలు వంటి వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ సిబ్బందితో పాటు ఆయా ప్రాంతాల్లోని ఏరియా ఆసుపత్రి వైద్యులు శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధులపై అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని కార్వాన్, నానల్‌నగర్, గోల్కొండ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. చాలారోజులుగా పూడికతీత చేపట్టకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు.

కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం



సంతోష్‌నగర్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కే సత్యనారాయణకు సీపీ సి.వి.ఆనంద్ శనివారం మెమోంటో, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని సూచించారు. అలాగే ఎస్సైలు, సిబ్బంది ఇన్‌స్పెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

పథకాలను వినియోగించుకోవాలి



గోల్కొండ: సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ సూచించారు. టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

పాతబస్తీ కిటకిట..!



చార్మినార్: ఓ వైపు రాఖీ పౌర్ణమి.. మరోవైపు వీకెండ్ శనివారం కావడంతో పాతబస్తీ సందర్శకులతో కిటకిటలాడింది. చార్మినార్‌తో పాటు మక్కా మసీదు, చౌమహల్లా ప్యాలెస్, సాలార్ జంగ్ మ్యూజియం, జూపార్కు తదితర పర్యాటక ప్రాంతాలను సందర్శకులు తిలకించారు. పర్యాటకుల సంఖ్య పెరగడంతో ఇటు చిరు వ్యాపారాలు కూడా జోరుగా సాగాయి. ఇక ఎప్పట్లాగే నయాపూల్ నుంచి గుల్జార్‌హౌజ్ వరకు వాహనదారులకు ట్రాఫిక్ తిప్పలు తప్ప లేదు. కొంతమంది చార్మినార్ భాగ్యలక్ష్మీ ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టిన కారు



సంతోష్‌నగర్: ఆగి ఉన్న వాహనాన్ని కారు ఢీకొన్న ఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ కే సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పిసల్‌బండ ఎస్‌బీఐ సమీపంలో శనివారం బొలెరో పిక్ఆప్ వాహనం మరమ్మతులకు గురి కావడంతో రోడ్డుపై ఆపి టైరు మారుస్తున్నాడు. అదే సమయంలో అటుగా వచ్చిన ఓ కారు బొలెరోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న కంచన్‌బాగ్ పోలీసులు చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని కారును తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మీరాలంమండిలో సామూహిక వ్రతాలు



చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో శనివారం సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశారు.

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం



మాట్లాడుతున్న మహ్మద్ ఇంతియాజుద్దీన్

గోల్కొండ: పరిసరాల శుభ్రతతో రోగాలు దరిచేరవని బల్దియా మలేరియా విభాగం అధికారి మహ్మద్ ఇంతియాజుద్దీన్ అన్నారు. గోల్కొండ నయాకీలాలోని ఉర్దూ మోడల్ స్కూల్‌లో దోమల నిర్మూలన, దోమ కాటు వల్ల వచ్చే వ్యాధులపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్లార్‌తో పాటు నీళ్ల ట్యాంకుల్లో వృథా కూలర్లు, నీటి బ్యారెల్స్‌లో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. ఇంట్లోని పాత సామాన్లు, వాడేసిన టైర్లు, ట్యూబ్‌లు ఉంచకూడదన్నారు. అలాగే బడిని, బడి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది రాజ్‌కుమార్, నర్సింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

దత్తాత్రేయ స్వామి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న ఆలయ ప్రతినిధులు

జియాగూడ: పౌర్ణమిని పురస్కరించుకుని కార్వాన్ దత్తాత్రేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, హోమం, మధ్యాహ్నం అఖండ హారతి, అనంతరం ఆకుల గోవర్దన్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మదన్ జాదవ్, పడాల అనంత కృష్ణ, దేవర శ్రీనివాస్, పీ శ్రీనివాస్, ఏ సాయి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బీ రామ్, ఉపాధ్యక్షులు వీ కండోజీ, కార్యదర్శి బీ చంద్రకాంత్, సహాయ కార్యదర్శి జే అనిల్, కోశాధికారి బీ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు



బూత్ ఇన్‌చార్జిలతో ఏఐసీసీ ప్రతినిధి విశ్వనాథ్

గోల్కొండ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఏఐసీసీ ప్రతినిధి విశ్వనాథ్ ధీమా వ్యక్తం చేశారు. షేక్‌పేట్‌లో కాంగ్రెస్ బూత్ ఇన్‌చార్జిలతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో గతంలో కంటే ఈసారి ఓటు బ్యాంకు గణనీయమంగా పెరిగిందని అభ్యర్థి ఎవరైనా సరే గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుని సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, నిజాముద్దీన్, అఫ్రోజ్, రఘు, రమేష్, ముజీబ్, స్వరూప, సోనీ తదితరులు ఉన్నారు.

మర్యాదపూర్వక కలయిక



కేంద్రమంత్రి బండి సంజయ్‌తో అమర్‌సింగ్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అమర్‌సింగ్ కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉందని ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆయన వివరించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్ రావడం ఖాయమని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.



ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో వాసు ముదిరాజ్, సుభాష్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు వాసు ముదిరాజ్, సుభాష్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలోనే అన్నివర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని పేర్కొన్నారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు

బంజారాహిల్స్: వార్–2 సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఆదివారం సాయంత్రం 5 నుంచి 10 గంటల వరకు యూసుఫ్‌గూడ బెటాలియన్ పోలీస్‌లైన్స్‌లో జరగనున్న దృష్ట్యా ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ విభాగం పేర్కొంది. ముఖ్యంగా కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం చుట్టూ ఉన్న రహదారుల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ట్రాఫిక్ ఉన్నతాధికారులు వెల్లడించారు. ట్రాఫిక్ రద్దీ తగ్గేలా సూచించిన రోడ్లలో వాహనదారులు ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. ప్రయాణ సమయంలో ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నెంబర్ 90102 03626ను సంప్రదించాలన్నారు.

- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం వైపు వెళ్లే వాహనాలను కృష్ణానగర్ జంక్షన్, శ్రీనగర్‌కాలనీ, పంజగుట్ట వైపు మళ్లిస్తారు.
- మైత్రీవనం జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, మాదాపూర్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను యూసుఫ్‌గూడ బస్తీ వద్ద ఆర్‌బీఐ క్వార్టర్స్, కృష్ణానగర్ జంక్షన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు మళ్లిస్తారు.
- మైత్రీవనం జంక్షన్ నుంచి బోరబండ బస్టాపు వైపు వచ్చే ట్రాఫిక్‌ను సవేరా ఫంక్షన్ హాల్, కృష్ణకాంత్ పార్కు, జీటీఎస్ టెంపుల్, కళ్యాణ్‌నగర్, మోతీనగర్, బోరబండ బస్టాపు వైపు మళ్లిస్తారు.
- బోరబండ బస్టాప్ నుంచి మైత్రీవనం జంక్షన వైపు వెళ్లే ట్రాఫిక్‌ను ప్రైమ్ గార్డెన్, కళ్యాణ్‌నగర్, మిడ్‌ల్యాండ్ బేకరీ, జీటీఎస్ కాలనీ, కళ్యాణ్‌నగర్ జంక్షన్, ఉమేష్‌చంద్ర విగ్రహం యూటర్న్, ఐసీఐసీఐ యూటర్న్, మైత్రీవనం జంక్షన్ వైపు మళ్లిస్తారు.
- యూసుఫ్‌గూడలో ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లను వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్ట హరిప్రసాద్ శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అభిమానులు ఇక్కడి పరిస్థితులను అర్థం చేసుకొని ఎలాంటి ఇబ్బంది పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే అభిమానులు తమ వాహనాల్లో కాకుండా మెట్రోలో రాకపోకలు సాగించాలన్నారు. కోట్ల విజభాస్కర్‌రెడ్డి స్టేడియం ఎదుటే మెట్రో స్టేషన్ ఉన్నందున అందరికీ ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. వాహనాల పార్కింగ్ సమస్యల దృష్ట్యా మెట్రోలో రాకపోకలతో ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు.

సాధారణ ప్రజలకు పార్కింగ్ స్థలాలు..

- మెట్రోపార్కింగ్ (జానకమ్మ తోట 1, 2) యూసుఫ్‌గూడ
- సవేరా ఫంక్షన్ హాల్, మహమూద్ ఫంక్షన్ హాల్ (ఫోర్ వీలర్స్ పార్కింగ్ కోసం)